క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



టెన్నీస్ అకాడమీని ప్రారంభిస్తున్న నాయకులు

పరిగి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని జింకన్న గ్రౌండ్‌లో ఎస్‌వీ చాంపియన్ టెన్నీస్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అకాడమీని పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేయడంతో ఎంతో మందికి మేలు కలగనుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ నార్మాక్స్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, జాక్ రవికుమార్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని రాళ్లగుడుపల్లిలో అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. బాలుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ నిర్వహించారు. స్వాములు భక్తి పాటలు పాడుతూ 18మెట్ల పూజ నిర్వహించి, దీపాలు వెలిగించి హారతి ఇచ్చారు. చివరగా స్వామివారికి నైవేద్యం తీసుకొచ్చి పూజలో ఉంచారు. ఈ కార్యక్రమంలో స్వాములు అధిక సంఖ్యలో హాజరై భిక్షలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



రాంసింగ్ నాయక్ తండాలో విరాళాలు సేకరిస్తున్న సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ పేర్కొన్నారు. సంజీవపూర్ తండాలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి ఆదివారం వాల్యానాయక్ తండా, రాంసింగ్ నాయక్‌లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలను, సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరి సహకారం అవసరమన్నారు.

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర



చక్రంపల్లిలో స్వామి వారి కల్యాణంలో భక్తులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని చక్రంపల్లిలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం నిర్వహించిన భక్తులు ధ్వజారోహణం, పుణ్యావచనం అనంతరం స్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో వీక్షించారు. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. శివస్తోత్రాలను ఆలపిస్తూ గొల్ల బీరులు నాట్యం చేశారు. అనంతరం వారు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై



తిరుప్పావై చదివి వినిపిస్తున్న శ్రీనివాసాచార్యులు

కొడంగల్: పట్టణంలోని పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం తిరుప్పావై పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం ప్రారంభమై ఆదివారానికి ఏడు రోజులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 6 గంటలకు శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణం చదివి వినిపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున కొడంగల్ ఆలయంలో ధనుర్మాసం పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

స్టేషన్‌ధారూరు–దోర్నాల్ రోడ్డు పూర్తయ్యేనా?

- కాంట్రాక్టర్లు మారినా మధ్యలో నిలిచిపోయిన పనులు
- వంతెన మధ్యలో విద్యుత్ తీగలంటూ కొన్ని రోజులు..
- పట్టించుకోని అధికారులు



ధారూరు: దోర్నాల్ వంతెన రోడ్డుపైన ఉన్న విద్యుత్ లైన్

ధారూరు: మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన పనులను మధ్యలోనే నిలిపేశారు. 2017లో ప్రారంభమైన ఈ పనులు బాలారిష్టాలు దాటడం లేదు. ముగ్గురు కాంట్రాక్టర్లు బిల్లులు రావడం లేదనే ఆందోళనతోనే పనులను వదిలిపెట్టి వెళ్లిపోయారు. చివరకు ఓ కాంట్రాక్టర్ అసంపూర్తి వంతెనను నిర్మించడానికి ముందుకు వచ్చారు. పాత రేట్లకు పనులు చేయలేమని చెప్పడంతో రివైజ్డ్ ఎస్టిమేట్‌తో రూ. కోటి వరకు పెంచారు. దీంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఈ వంతెన నిర్మాణానికి రూ.4.70 కోట్లు మంజూరు చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో మరో రూ. 2 కోట్లు నిధుల విడుదలకు అనుమతులు లభించాయి. ఈ క్రమంలో వంతెనపై ఇంకా రెండు పిల్లర్లపై స్లాబ్‌లు వేయాల్సి ఉంది. ఇంతవరకు చేసిన రూ.కోటి బిల్లు త్వరగా రాకపోవడంతో కాంట్రాక్టర్ బిల్లు కోసం ఎదురు చూస్తూ పనులను ఆపేశాడు. మూడు నెలల నుంచి పనుల పురోగతి లేకపోవడంతో అసలు పనులు పూర్తవుతాయా?లేదా? అని సమీప గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ తీగలను తొలగించని సిబ్బంది..

వంతెన పనులకు బిల్లులు రాకపోవడం ఓ కారణం. విద్యుత్ తీగలు వంతెనపై ఉండడం ఇంకో కారణంగా ఉంది. ఈ విషయంలో విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. వాటిని తీసివేయించే అధికారులు కరువయ్యారా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వంతెనపై ఉన్న తీగలను తొలగించాలని స్వయంగా స్పీకర్ ఆదేశించినా ఇంతరకు వాటిని సరిచేయలేదు. వంతెన పక్కనే వ్యవసాయ పొలానికి రోడ్డుపై నుంచి విద్యుత్ లైన్ వేశారు. వంతెనకు రెండు వైపుల రోడ్డుకు అడ్డంగా విద్యుత్ తీగలు ఉండడంతో మిల్లర్ వాటి కింద నుంచి వెళ్లి సీసీ మిశ్రమాన్ని స్లాబ్‌పై వేయాల్సి ఉంది. మిల్లర్ విద్యుత్ తీగల కింద నుంచి తీసుకెళ్లేందుకు పైన విద్యుత్ తీగలు తాకుతాయనే స్లాబ్ వేయలేకపోతున్నామని సూపర్‌వైజర్ పేర్కొన్నారు. వీటిని తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ, సిబ్బందిని కోరినా ఫలితం లేకపోయిందని ఆయన పేర్కొన్నారు.



విద్యుత్ తీగలతో నిలిపేసిన స్లాబ్ పనులు

రక్తదానంతో ప్రాణదానం

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



రక్తదానం చేస్తున్న యువతను అభినందిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: రక్త దానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం జమియతే–ఏ–ఉలేమా ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిపూర్ ఉర్దూ ఘన్ షాదీఖానాలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, అత్యవసర ఆపరేషన్ల సమయంలో రక్తం అవసరం ఉంటుందన్నారు. అలాంటి సమయంలో రక్తదానం చేస్తే వారికి పునర్జన్మ కల్పించిన వారవుతారన్నారు. జమియతే ఏ ఉలేమా సంస్థ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 80 మంది రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. అనంతరం సంస్థ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా అజర్‌ఖాస్మీ మాట్లాడుతూ ప్రమాదాలు, ప్రసవాల సమయంలో రక్తం అవసరం ఉంటుందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో రక్తం అవసరం ఉంటుందని తెలుసుకుని తాండూరులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాలా, సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహ్మాన్ అతర్ ఖాస్మీ, సభ్యులు డాక్టర్ హఫీజ్ అబ్దుల్ సలాం, మౌలానా అసీవుద్దీన్ రషీది, హఫీజ్ మహ్మద్ రయీసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

స్పీకర్‌కు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల వినతి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎస్‌ఏ జిల్లా నాయకులు

అనంతగిరి: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పర్యటనకు వచ్చిన ప్రసాద్‌కుమార్‌ను ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగ బృందం కలిసి వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంగ్యానాయక్ మాట్లాడారు. వెంటనే తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 17 రోజులుగా తాము నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో తమను ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం స్పందించిన స్పీకర్ సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో శ్రీశైలం, విజయ్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య



ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: పేద కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని అంతారం గ్రామంలో వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ నేతలతో వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.9వేల సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ ఆనంద్, నేతలు రాంచంద్రయ్య, చంద్రయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ విందు

తాండూరు రూరల్: తాండూరు నియోజకవర్గంలోని క్రిస్టియన్ సోదరులకు పట్టణంలోని వైట్‌ప్యాలెస్‌లో సోమవారం క్రిస్మస్ విందు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించే ఈ విందుకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మోమిన్‌పేట మండల సోదరులకు సోమవారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి పేర్కొన్నారు. వికారాబాదు పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: నియోజకవర్గంలోని క్రిస్టియన్ సోదరులకు మంగళవారం క్రిస్మస్ విందు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల, కోస్గి, గుండుమాల్, మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన క్రిస్టియన్లకు విందు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని మురహరి ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న రవిచంద్రన్

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రన్ డిమాండ్

తాండూరు టౌన్: రాష్ట్ర వ్యాప్త మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె రవిచంద్రన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాండూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఉద్యోగులకు రూ. 26వేల వేతనం, ప్రతినెలా రెండో తేదీనే చెల్లించాలన్నారు. పండుగ, జాతీయ సెలవులను కార్మికులకు వర్తింప చేయాలని, అధికారుల ఒత్తిళ్లు తగ్గించాలని, తాండూరులో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గడ్డం అశోక్, గోపాల్, మున్సిపల్ యూనియన్ నాయకులు నరసింహ, వెంకటప్ప, వెంకటేష్, విజయలక్ష్మి, దేవి, మంజుల, సువర్ణ, యాదమ్మ, జయలక్ష్మి, దస్తప్ప, శివకన్య తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి



అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంబేడ్కర్‌సంఘం నేతలు

దోమ: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆవేదన కలిగించాయని అంబేడ్కర్ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో అంబేడ్కర్ సంఘం నేతలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం అంబేడ్కర్ చేసిన సేవలను కేంద్ర మంత్రి తన స్థాయిని మరిచి ఇష్టానుసారంగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. యావత్ దేశ ప్రజలకు కేంద్ర మంత్రి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాములు, అంబేడ్కర్ సంఘం నాయకులు రామన్నమాదిగ, వెంకటేశ్, రమేశ్, జంగయ్య, షేర్‌ఖాన్, మోయిన్ పాష, మోహిజ్‌పాష, మహేశ్‌లక్కీ, శ్రీకాంత్, నర్సింహ, చరణ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన్‌కుమార్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

చేవెళ్ల: బ్రాహ్మణుల హక్కుల సాధన కోసం అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు నిర్వహిస్తున్న మహాసమ్మేళనాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌కే సృజన్ కుమార్ కోరారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో బ్రాహ్మణ మహా సమ్మేళన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణుల హక్కుల సాధన, అభివృద్ధికి చేస్తున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ బాగస్వాములు కావాలని సూచించారు. ఈ నెల 29వ తేదీన నగరంలోని రవీంద్ర భారతిలో ఈ సమ్మేళనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు శ్రీధర్, కన్న, సురేదర్, తదితరులు ఉన్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి



బంట్వారం: శాఖ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న యాదగిరి, శ్రీనివాస్



పరిగి: నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

బంట్వారం: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతి వేడుకలను ఆదివారం బంట్వారంలోని శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, గ్రంథపాలకుడు శ్రీనివాస్ వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరిగిలో..

పరిగి: మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు, మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేసిన గొప్ప నాయకులని కొనియాడారు. పీవీ రావు, వెంకటస్వామి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాములు, వసంతకుమార్, శ్రీనివాస్, చందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 26న ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: ఈ నెల 26వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు వారి ఆధార్‌కార్డు తీసుకొచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ తెలిపారు.

◆ పుణ్యక్షేత్రానికి తరలిన ఆధ్యాత్మిక సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఆధ్యాత్మిక, ధార్మిక సేవా సమితి సభ్యులు ఆదివారం యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు. చాతుర్మాస ముగింపు సందర్భంగా ప్రతిఏటా పుణ్యక్షేత్రాలకు వెళ్లనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకోనున్నట్లు సభ్యులు తెలిపారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దోమ: దోమ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ వినయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని బాస్‌పల్లి, ఊటుపల్లి, పాలేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

◆ జినుగుర్తిలో మల్లన్న జాతర



తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. కురుమ సోదరులు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పూజల అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుర్వ నర్సిములు, పూజారి పాండు, గౌడి వెంకటేశం, భీమయ్య, ఉల్లి నర్సిములు, పల్లె వెంకటయ్య, గోపాలకృష్ణ, బాలు, మోహన్, రాజు, జగదీశ్ పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

కొత్తూరు: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల పారిశుద్ధ్యం, అభివృద్ధి బాధ్యత ప్రత్యేకాధికారులు చేపట్టారు. వాస్తవానికి తమ శాఖాపరమైన పని ఒత్తిళ్లతో వారు గ్రామాల అభివృద్ధిపై అంతగా దృష్టిపెట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌లు కొనసాగిన సమయాల్లో పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రాధాన్యతనిచ్చేవారు. తప్పని సరిగా నిత్యం సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంప్‌యార్డులకు తరలించేవారు. ప్రస్తుతం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు, ప్రజలు చెత్తను ఇళ్ల సమీపంలో, ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారు. దీంతో స్థానికుండా ఉండే ప్రజలు దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో కల్లు దుకాణం పక్కనే చెత్త పేరుకుపోయింది. భారీ గాలులు వీచినప్పుడు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఇళ్ల ముందుకు వచ్చి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇన్ముల్‌నర్వలో కల్లు దుకాణం వద్ద పేరుకుపోయిన చెత్త

చెట్లు నరికి.. నిప్పు పెట్టి!

- ధారూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీ భూముల ఆక్రమణ
- పెట్రోలింగ్ సిబ్బందికి చిక్కిన ఇద్దరు వ్యక్తులు



రాస్నం సెక్షన్‌లో చెట్టును నరికివేసి నిప్పు పెడుతున్న వ్యక్తి



నిప్పు పెట్టడంతో దగ్ధమవుతున్న చెట్టు

ధారూరు: చెట్లను నరికేసి, నిప్పు పెడుతున్న ఇద్దరు వ్యక్తులను అటవీ శాఖ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రాస్నం సెక్షన్‌లోని కంపార్ట్‌మెంట్ 111లో పెట్రోలింగ్ చేస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు నరికివేసిన చెట్లకు నిప్పు పెడుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలు తీసిన అనంతరం పెట్రోలింగ్ అధికారి, సిబ్బంది వీరిని పట్టుకున్నారు. యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన కావలి శ్రీను, కుమ్మర్‌పల్లి మొగులయ్యగా గుర్తించారు. వీరు ఏడాది కాలంగా తమ పొలాల సమీప అడవిలోని చెట్లను నరుకుతూ, భూమిని తమ పొలాల్లో కలిపేసుకుంటున్నారని తెలిపారు. అడవిలోని చెట్లను నరకడం, ఎండిపోయిన చెట్లకు నిప్పు పెట్టడం నేరమన్నారు. రాత్రి వేళ, సెలవు రోజుల్లో ఇలాంటి దుశ్చర్యలు జరుగుతున్నాయని ఫారెస్ట్ అధికారి రాజేందర్ వివరించారు. దీనివలన వన్యప్రాణులు, జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. రాస్నంతో పాటు సంగాయపల్లికి చెందిన కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా చెట్లను నరికివేసి తమ భూమిలో కలిపేసుకుంటున్నారని తెలిపారు. ఇక నుంచి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి అటవీ భూముల ఆక్రమణను అడ్డుకుంటామని స్పష్టంచేశారు.